క్లుప్తంగా

నేడు వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం

ఆత్మకూరురూరల్: దేపూరులోని భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో 35వ ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. వేకువజాము నుంచి విశేషాభిషేకాలు, పూజలు, అలంకరణలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం పండరి భజన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

శ్మశానంలో అక్రమంగా బోరు ఏర్పాటుపై ఫిర్యాదు



దుత్తలూరు : భైరవరం పంచాయతీ పరిధిలోని తురకపల్లిలోని దళితుల శ్మశాన వాటికలో అక్రమంగా బోరు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల కోసం కేటాయించిన శ్మశాన స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నంలో భాగంగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బోరు ఏర్పాటు చేశారని ఆరోపించారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుని బోరు తొలగించాలని విజ్ఞప్తి చేస్తూ సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ గులాంకు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయాన్ని వీఆర్వో మాల్యాద్రి దృష్టికి తీసుకెళ్లారు. సీపీఎం నాయకులు గుజ్జుల మల్లికార్జున, ఎన్.సింహాద్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల వసూళ్లపై దృష్టి సారించాలి



సీతారామపురం : స్త్రీనిధి రుణాలకు సంబంధించిన మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఉదయగిరి ఏరియా కోఆర్డినేటర్ రత్నమ్మ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సమాఖ్య ఈసీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఉన్నతి, బుక్ కీపింగ్ 2.0, వీవోఆర్ఎఫ్, బ్యాంకు లింకేజీ రుణాలు తదితరాలపై సమీక్షించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా రుణాలను చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు, ఎమ్మెస్‌ఓబీ, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ భవనంపై మర్రిచెట్టు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

సీతారామపురం: మండల తహసీల్దార్ కార్యాలయ భవనం గోడపై మొలిచిన మర్రి మొక్కను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో బాగా పెరిగి గోడ దెబ్బతింది. ఈ విషయమై 'సాక్షి'లో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన శుక్రవారం కథనం వెలువడడంతో తహసీల్దార్ ఫజిహా స్పందించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ భవనంపై పెరిగిన మర్రిచెట్టు, ఇతర మొక్కలను తొలగింపజేశారు. పరిసరాల్లో మొక్కలను సైతం తొలగించి శుభ్రం చేయించారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు



చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం గాలిపాళెంలో భగవాన్ వెంకయ్యస్వామి 36 ఆరాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం వెంకయ్యస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, పల్లకిసేవ నిర్వహించారు.మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. కాగా చివరిరోజైన ఆదివారం ఉదయం 11 గంటలకు చిన్న వెంకయ్యస్వామి వారిచే అభిషేకం, పల్లకిసేవ నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం, తేరు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

దుత్తలూరు: మండలంలోని తిమ్మాపురంలో స్వామిత్వ సర్వేను డిప్యూటీ ఎంపీడీఓ ఎం మల్లికార్జున శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వామిత్వ సర్వే ద్వారా గ్రామాల్లోని అన్ని రకాల ఆస్తులను గుర్తించి యాజమాన్య హక్కులను కల్పించనున్నట్లు తెలిపారు. మండల సర్వేయర్ శివ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు చిరస్మరణీయుడు

దుత్తలూరు: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని తహసీల్దార్ యనమల నాగరాజు అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రకేశరి చిత్రపటానికి తహసీల్దార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు. మండల సర్వేయర్ శివ, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ గులాం, ఆర్ఐ, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అప్పాజీ, మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో టంగుటూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, ఆంధ్ర రాష్ట్ర తొలిముఖ్యమంత్రిగా అందించిన సేవలను స్మరించుకున్నారు.

వరికుంటపాడు: మండల తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పసుపులేటి హేమంత్‌కుమార్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గోపి శ్రీనివాసులు ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉదయగిరిలోని వ్యవసాయ కళాశాలలో ఆంధ్రకేసరికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సీతారామపురం : మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి ఎంపీడీఓ సాయిప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఆంధ్ర కేసరి తుదిశ్వాస వరకు ప్రజల కోసమే పనిచేశారని, ఆయన చేసిన స్వాతంత్ర్య పోరాటాలు, ప్రజాసేవ ఎప్పటికీ ఆదర్శమన్నారు. ఈఓపీఆర్డీ రామనాథ్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ షాలెట్ టంగుటూరి ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక గ్రామసచివాలయంలో టంగుటూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదిరి వెంకటరంగారావు పంచాయతీ కార్యదర్శి చెంచుకృష్ణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రకేసరి చిత్రపటానికి ఎంపీడీఓ ప్రసన్నకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రకేశరి చిత్రపటానికి ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ రఫీఖాన్, తదితరులు నివాళులర్పించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



దుత్తలూరు తహసీల్దార్ కార్యాలయంలో..



ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో..



ఏఎస్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో..



కలిగిరి సచివాలయంలో..



సంగం తహసీల్దార్ కార్యాలయంలో..



సీతారామపురం ఎంపీడీఓ కార్యాలయంలో..

25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

దుత్తలూరు/అల్లూరు: రేషన్ లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ కార్డులను సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు దుత్తలూరు, అల్లూరు తహసీల్దార్లు యనమల నాగరాజు, లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ షాపునకు మ్యాపింగ్ చేయబడిన సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దే కార్డులను అందజేయనున్నట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. ఈ నెల 30వ తేదీలోగా పంపిణీని పూర్తి చేయనున్నట్లుతెలిపారు.

చెన్నైకు సూపర్‌లగ్జరీ సర్వీసు నడపాలని విజ్ఞప్తి

ఉదయగిరి రూరల్: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి చెన్నైకు రాత్రి వేళ సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును నడపాలని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ గడియాల్పి యస్దానీ, ఉపసర్పంచ్ మూర్తుజాహుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉదయగిరి ప్రాంతం నుంచి నిత్యం వందలాది మంది చెన్నైకు వివిధ పనులపై వెళ్తుంటారన్నారు. ఉదయగిరి డిపో నుంచి చెన్నైకు ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు మాత్రమే నడుస్తుండడంతో వివిధ పనులు, వైద్యశాలలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సూపర్‌లగ్జరీ సర్వీసులు లేనందున అధిక చార్జీలు వెచ్చించి ప్రైవేట్ ట్రావెల్స్‌లో వెళ్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉదయగిరి డిపో అధికారులు స్పందించి ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉదయగిరి నుంచి చెన్నైకు సూపర్‌లగ్జరీ సర్వీసు నడపాలని విజ్ఞప్తి చేశారు.

డీసీపల్లిలో ముగిసిన పొగాకు వేలం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు వేలం ప్రక్రియ శనివారంతో ముగిసింది. మార్చి 9న ప్రారంభమైన వేలం ప్రక్రియ 127 రోజుల పాటు సాగింది.పొగాకు బోర్డు అనుమతించిన మేరకు 7.03 మిలియన్ కిలోల పొగాకును విక్రయించగా, రూ.1,65,63,02,771ల వ్యాపారం జరిగింది. వేలం కేంద్రం పరిధిలోని 1747.50 బ్యారెన్లకు చెందిన 2,081 మంది రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకున్నారు. వేలానికి 80,681 బేళ్లు రాగా, 55,980 బేళ్లను 23 కంపెనీలకు చెందిన ప్రతినిధులు కొనుగోలు చేశారు. వేలంలో గరిష్ఠ ధర రూ.291 పలకగా, కనిష్ఠ ధర రూ.17 లభించింది. సగటు ధర రూ.235.29గా నమోదైంది. కాగా ఈ పంట కాలంలో పొగాకు రైతుల సంక్షేమానికి అన్ని రకాల చర్యలను పొగాకు బోర్డు తీసుకుందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. రైతులు ఎటువంటి ఒడిదొడుకులు లేకుండా పండించిన పొగాకును అమ్ముకున్నారని చెప్పారు. అదనంగా పండించిన పొగాకు కొనుగోళ్లకు సంబంధించి ఇంకా అనుమతులు రావాల్సి ఉందని తెలిపారు. వచ్చే పంట కాలానికి రైతులు బోర్డు అనుమతించిన మేరకే పొగాకు సాగు చేపట్టాలని సూచించారు. పొగాకు బ్యారెన్‌లు, భూమిని అధిక కౌలుకు తీసుకుని పంట వేయడం వల్ల నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో సార్ఢ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ కేజీయా రూత్, బెనోమి, ఏఆర్‌డబ్ల్యూఓలు సునంద, సుస్మిత, సుగుణ, ఉమామహేశ్వరి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కావలి (జలదంకి): పట్టణంలోని మున్సిపల్ పాఠశాల, మేధా జూనియర్ కళాశాలలో సార్ఢ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ నేటి సమాజంలో యువతపై హెచ్‌ఐవీ ప్రతికూల ప్రభావం చూపిస్తుందన్నారు. హెచ్‌ఐవీ వ్యాప్తి, నిర్ధారణ, నివారణ, చికిత్స విధానం తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే చెడువ్యసనాలు, డ్రగ్స్‌తో కలిగే నష్టాలను వివరించారు. సార్ఢ్ సభ్యులు ప్రశాంతి, హేమలత, శ్రీరేఖ తదితరులు పాల్గొన్నారు.



అండర్‌డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు

• ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి: పట్టణంలో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. పట్టణంలోని సినిమాహాలు వీధిలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అండర్ డ్రైనేజీ నిర్మాణమే ఏకైక మార్గమన్నారు. అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని, ప్రతిఒక్కరూ తమ ఇళ్లు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీఓ అప్పాజీ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీతారాముపురం : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ఎంపీడీఓ సాయిప్రసాద్ అన్నారు. సీతారామపురంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో అధికారులు పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ మస్తాన్‌వలి, ఈఓపీఆర్డీ రామనాథరెడ్డి, వెలుగు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



కలిగిరి: గోదాములో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ అనిత



వింజమూరులో రిజిష్టర్లను తనిఖీచేస్తున్న విజిలెన్స్ అధికారులు

వింజమూరు(ఉదయగిరి)/కలిగిరి: వింజమూరు, కలిగిరి మండలాల్లోని 16 ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై జిల్లా విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని ఎరువులు, పురుగు మందుల స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. 22 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లుగా గుర్తించారు. యూరియాను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. విజిలెన్స్ అధికారులు కే విష్ణురావు, టీ వేణుగోపాల్, శాంతిభూషణ్‌రెడ్డి, జీ అనితతో పాటు స్థానిక ఏఓలు వాసు, జహీర్ పాల్గొన్నారు. అలాగే ఉదయగిరి మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆత్మకూరు ఇన్‌చార్జ్ ఏడీఏ శైలజకుమారి తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుమందుల క్రయ విక్రయాల రిజిష్టర్లను తనిఖీ చేసి గోదాముల్లోని స్టాక్ నిల్వలను పరిశీలించారు. రిజిష్టర్లు అప్‌డేట్ చేసుకోవాలని, స్టాక్, సేల్స్ మధ్య వ్యత్యాసాలు లేకుండా చూసుకోవాలని డీలర్లకు సూచించారు. ఆమె వెంట ఏఓ విజయభాస్కర్ ఉన్నారు.

మహిళపై దౌర్జన్యం

వింజమూరు(ఉదయగిరి): తన ఇంట్లోకి అర్ధరాత్రి వేళ కొందరు దౌర్జన్యంగా ప్రవేశించి వస్తువులను ధ్వంసం చేశారని వింజమూరులోని బంగ్లాసెంటర్‌లో నివాసం ఉంటున్న షేక్ హబీమున్నీసా శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు..హబీమున్నీసాకు భర్త ఖాదర్‌బాషాకు మధ్య వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భర్త ప్రోద్బలంతో నజీర్ అనే వ్యక్తి 20 మంది గుర్తుతెలియని వ్యక్తుల్ని తీసుకొచ్చి హబీమున్నీసాపై దౌర్జన్యం చేసి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసి నష్టపరిచారు. అర్ధరాత్రి అలజడి చెలరేగడంతో చుట్టుపక్కల వారు మేల్కొని పోలీసులకు సమాచారం అందించడంతో దుండగులు పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా హబీమున్నీసా నివాసముంటున్న ఇంటిని ఆమె భర్త ఖాదర్ బాషా వేరేవారికి విక్రయించినందున కొన్నవారు ఇంటిని ఖాళీ చేయించే నిమిత్తం దౌర్జన్యానికి పాల్పడినట్లుగా ప్రాథమిక సమాచారం.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం శంఖవరంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని విశేషంగా అలంకరించి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

కొండాపురం: మండలంలోని కొమ్మి పంచాయతీలో తెలుగు తమ్ముళ్ల మధ్యన గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయి. శనివారం గ్రావెల్, ఇసుక తరలింపు విషయమై ఏకంగా బస్టాండ్ సెంటరులో ఇరువర్గాల వారు బాహాబాహీకి దిగారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక సహజ వనరులైన ఇసుక, గ్రావెల్ తరలింపు విషయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వర్గం, సీనియర్ నాయకుల మధ్యన గొడవలు జరుగుతున్నారు. ఇటీవల చెరువులోని గ్రావెల్, వాగులో ఇసుక తరలింపులో విషయంలో రెండు వర్గాల మధ్యన ఘర్షణలు నెలకొనగా ఎమ్మెల్యే కాకర్ల దగ్గర పంచాయతీ జరిగింది. అనంతరం కొద్ది రోజులుగా ఎవరికి వారు అన్నట్లుగా ఉంటున్నారు. మళ్లీ శనివారం కొమ్మి బస్టాండ్ సెంటర్‌లో గ్రావెల్ తోలే విషయమై ఇరువర్గాల వారు బాహాబహీకి దిగారు. ఈ క్రమంలో ఓ యువనాయకుడికి చెంప దెబ్బలు కూడా పడినట్లుగా సమాచారం . గ్రావెల్, ఇసుక దందా విషయంలో తముళ్లు గొడవలకు దిగుతున్నా ఎమ్మెల్యే చూసీచూడనట్లుగా మౌనం వహించడంపై గ్రామ టీడీపీ నాయకులే విమర్శలు చేస్తున్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు

ఉదయగిరి: పట్టణానికి అతి సమీపంలో ఉన్న పెద్దచెరువు నుంచి కొందరు అక్రమార్కులు శనివారం సాయంత్రం గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. చెరువులో జేసీబీని ఏర్పాటు చేసి 20 ట్రాక్టర్ల ద్వారా ఓ ప్రైవేట్ స్థలానికి గ్రావెల్‌ను పెద్ద ఎత్తున తరలించారు. ఓ వైపు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గ్రావెల్ అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులను వివరణ అడిగేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

వైభవంగా పదహారు రోజుల పండగ



విశేషాలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి



సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో పదహారు రోజుల పండగను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పుష్కర కుంభాభిషేక మహోత్సవం జరిపి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా దేవదేవేరుల మూలవిరాట్టులకు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి మహిళలతో సామూహిక లలితా సహస్ర, విష్ణు సహస్రనామ పారాయణం చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయం చిన్నారులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు.

దర్గా పవిత్రతను కాపాడుకుందాం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా పవిత్రతను కలిసికట్టుగా కాపాడుకుందామని ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్, ఆర్డీఓ భూమిరెడ్డి పావని అన్నారు. ఏఎస్‌పేటలోని కామాక్షి కల్యాణ మండపంలో కేర్‌సెంటర్స్, లాడ్జిల నిర్వాహకులతో శనివారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్గా పవిత్రతను కాపాడుకునేందుకు లాడ్జిల నిర్వాహకులు, కేర్ టేకర్లు చట్టాలకు లోబడి పనిచేయాలన్నారు. దర్గాకు దేశనలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారని తెలిపారు. వీరికి అద్దె గదులను ఇచ్చే యజమానులు తప్పనిసరిగా ఆధార్‌కార్డులను తనిఖీ చేయాలన్నారు. పూర్తిస్థాయిలో వివరాలను సేకరించాలన్నారు. ప్రతి లాడ్జిలో బాధ్యతగా సీసీకెమెరాలు బిగించాలన్నారు. దర్గా ప్రాంతంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తుల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కేర్ సెంటర్ల నిర్వాహకులు మతిస్థిమితం లేని వ్యక్తుల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. మానసిక రోగుల విషయంలో కేర్‌టేకర్ పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఏఎస్‌పేటలో గంజాయిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వేమారెడ్డి, ఎస్సై సైదులు, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ కె వేణుగోపాల్

ఉదయగిరిని జిల్లా చేయాలని వినతి

ఉదయగిరి రూరల్: చారిత్రక నేపథ్యం కలిగి దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోక పూర్తిగా వెనుకబడిన ఉదయగిరి కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎల్ రామ్మోహన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, సరిహద్దులు, పేర్ల మార్పులు, చేర్పులకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఉదయగిరిని జిల్లా చేయాలని వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన 21 మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముట్టుకుందు తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి, సోమిరెడ్డి, ఈర్ల శ్రీనివాసులు, ఉప్పుటూరు హరి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

అనుమసముద్రంపేట/అల్లూరు : ఆత్మకూరు పోలీసు డివిజన్ పరిధిలో వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ తెలిపారు. ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తోందన్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో విగ్రహాల ఏర్పాటు వివరాలు తెలిపి నమోదు చేసుకుంటే సంబంధిత పోలీస్‌స్టేషన్ ద్వారాఅనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై సైదులు ఉన్నారు. కాగా అల్లూరు మండలంలో వినాయక చవితికి విగ్రహాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

కలిగిరి: మండలంలో లేఅవుట్లు వేసే వారు నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ వెలుగోటి మధు అన్నారు. వెలగపాడు పంచాయతీ కమ్మవారిపాళెం వద్ద కేజీబీవీ ఎదురుగా లేఅవుట్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి తనూజతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. లేఅవుట్ వేయకుండానే ఎస్ఎల్ఎన్ వారి సూర్య టౌన్‌షిప్ పేరుతో బ్రోచర్లు ముద్రించి ప్లాట్లను విక్రయిస్తున్నట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆయన లేఅవుట్ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. లేఅవుట్ వేయకుండా ప్లాట్ల అమ్మకాలు చేస్తున్నట్లు ప్రజలను మభ్యపెట్టడం సమంజసం కాదన్నారు. సుడా అనుమతులు ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులను సంప్రదించి అన్ని రకాల అనుమతులను తప్పనిసరిగా పొందాలన్నారు. ఇంత వరకు లేఅవుట్ వేస్తున్న వారు పంచాయతీని సంప్రదించలేదన్నారు. నిబంధనల మేరకు లేఅవుట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రజలు అన్ని అనుమతులను, క్షేత్రస్థాయిలో లేఅవుట్లను పరిశీలించిన తరువాతే ప్లాట్లను కొనుగోలు చేయాలని సూచించారు. అనుమతులు లేని లేఅవుట్లల్లో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు.